

సీహెచ్‌సీ సందర్శన

పొన్నూరు: నిడుబ్రోలు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం సందర్శించింది. రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 41,082 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. దిగువకు 82,027 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నీటి నిల్వ 42.1600 టీఎంసీలు.



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కేఎస్ విశ్వనాథన్ సోమవారం దుర్గమ్మను దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

మహిళ అవయవాల దానం



రాజులపాటి పాప (ఫైల్)

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని మణిపాల్ ఆసుపత్రిలో సోమవారం అవయవాల దానం జరిగింది. ఈ సందర్భంగా హాస్పిటల్ డైరెక్టర్ రామాంజనేయరెడ్డి, ఆంధ్రప్రదేశ్ జీవన్‌దాన్ చైర్మన్ డాక్టర్ కె. రాంబాబులు మాట్లాడుతూ.. తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేటకు చెందిన రాజులపాటి పాప (64) ప్రమాదానికి గురి అయిందన్నారు. ఆమె బంధువులు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారని తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం శస్త్రచికిత్స నిర్వహించారని పేర్కొన్నారు. అయినా ఆమె ఆరోగ్య పరిస్థితిలో మార్పు కనిపించలేదని చెప్పారు. అనంతరం బ్రెయిన్ డెడ్‌గా వైద్యులు ప్రకటించారని తెలిపారు. కుటుంబ సభ్యుల ఆమోదంతో ఆమె అవయవాలను సేకరించి కాలేయాన్ని మణిపాల్‌లో ఒక రోగికి ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారన్నారు. కార్నియాను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించామని వివరించారు. మంచి కార్యానికి ముందుకు వచ్చిన దాత కుటుంబసభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

తురకపాలెంలో ఎన్‌సీడీసీ బృందం



గుంటూరు రూరల్: మండలంలోని తురకపాలెం గ్రామంలో నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ) బృందం ప్రతినిధులు సోమవారం పర్యటించారు. గ్రామంలో పలు ప్రాంతాలను పరిశీలించారు. ఎస్సీ కాలనీలో , విలేజ్ క్లినిక్ ప్రాంతాల్లో మట్టిని సేకరించారు. బెంగళూరుకు చెందిన బృందంతోపాటు గుంటూరు జిల్లాలోని ఎన్‌సీడీసీకి చెందిన 40 మందికి పైగా పాల్గొన్నారు. గ్రామంలో నీటి నమూనాలను కూడా సేకరించారు. మట్టి, నీటిని పరీక్షల నిమిత్తం తీసుకెళుతున్నట్లు బృందం సభ్యులు తెలిపారు.

న్యాయవాద కోర్సుల పరీక్షలు ప్రారంభం



పెదకాకాని: నాగార్జున విశ్వవిద్యాలయం పీజీ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో సోమవారం మాస్టర్ ఆఫ్ లా (ఎల్‌ఎల్‌ఎం) ద్వితీయ సెమిస్టర్, ఐదు సంవత్సరాల ఆనర్స్ బీబీఏఎల్‌ఎల్‌బీ, బీఏఎల్‌ఎల్‌బీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ఈ మేరకు పీజీ పరీక్షల కో ఆర్డినేటర్ ఆచార్య ఎం.సుబ్బారావు తెలిపారు. ఎల్‌ఎల్‌ఎం పరీక్షలు ఏఎన్‌యూతోపాటు గుంటూరులోని జేసీ కాలేజ్ ఆఫ్ లా, ఏసీ కాలేజీ పరీక్ష కేంద్రాల్లో కొనసాగుతున్నాయన్నారు. ఐదు సంవత్సరాల ఆనర్స్ పరీక్షలు విశ్వవిద్యాలయంలోని టీటీఎం విభాగంలో ప్రారంభం అయ్యాయన్నారు. పరీక్షలను సమర్థంగా నిర్వహించేందుకు ప్రత్యేక తనిఖీల బృందాలను నియమించినట్లు వివరించారు.

ఎంఎస్సీ కెమిస్ట్రీ ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ (పెదకాకాని): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సు రెండో సెమిస్టర్ ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాదరావు సోమవారం విడుదల చేశారు. 507 మందికిగాను 357 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. వర్సిటీ అందిస్తున్న డిప్లమో ఇన్ ఫొటోగ్రఫీ కోర్సు రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను కూడా విడుదల చేశారు. 15 మందికి గానూ అందరూ ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. రీవాల్యుయేషన్ కోసం ఈ నెల 23వ తేదీలోగా పేపరుకు రూ.1860 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు.

పులిచింతలకు 58,122 క్యూసెక్కులు విడుదల

రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద నున్న నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ ఐదు క్రస్ట్‌గేట్లు, రెండు యూనిట్లు ద్వారా విద్యుత్ ఉత్పాదన అనంతరం మొత్తం 58,122 క్యూసెక్కులను పులిచింతలకు విడుదల చేసినట్లు ఎస్‌ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రమణ్యం సోమవారం తెలిపారు. టెయిల్‌పాండ్ ప్రాజెక్టు రిజర్వాయర్ ఐదు క్రస్ట్‌గేట్లు రెండు మీటర్లు ఎత్తు ఎత్తి 49,720 క్యూసెక్కులు, రెండు యూనిట్ల ద్వారా విద్యుత్పాదన అనంతరం 8,402 క్యూసెక్కులు మొత్తం 58,122 క్యూసెక్కులను దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.



వేమూరు ప్రొహిబిషన్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అశోక్‌బాబు, నేతలు



నగరంలో మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్



బాపట్లలో నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

కూటమి తాగుడుమూతలపై ఆగ్రహం

- అధినేత పిలుపుతో నిరసనల భేరీ మోగించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- నకిలీ మద్యంపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్
- తయారీదారులను జైలుకు పంపాలి
- ప్రజల ప్రాణాలు బలిగొంటున్న కల్తీ మద్యాన్ని అరికట్టాలి
- చర్యలు లేకపోతే ఆందోళన తీవ్ర తరం
- సోమవారం జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, ఎక్సైజ్ కార్యాలయాల వద్ద ధర్నాలు
- అధికారులకు వినతులు
- వేమూరులో కదం తొక్కిన పార్టీ శ్రేణులు
- రేపల్లె, అద్దంకి, చీరాల, బాపట్ల, పర్చూరుల్లో ఆందోళనలు
- జోరు వర్షంలోనూ నిరసనల హోరు



నకిలీ మద్యంపై వైఎస్సార్ సీపీ రణభేరి మోగించింది. కూటమి ప్రభుత్వ అక్రమ సంపాదనపై ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యం తయారు చేస్తూ పేదల ప్రాణాల్ని బలిగొంటున్న పచ్చ పార్టీ నేతల్ని అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం పార్టీ శ్రేణులు జిల్లా వ్యాప్తంగా భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. నియోజకవర్గ కేంద్రాల్లో మద్యం బాటిళ్లు, ప్లకార్డులతో ర్యాలీలు, ఎక్సైజ్ కార్యాలయాల వద్ద వైఎస్సార్ సీపీ నేతలు ధర్నాలు చేశారు. జిల్లాలోని మద్యం దుకాణాలు, బార్లు, బెల్టు దుకాణాలు, పర్మిట్ రూముల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మద్యం వెనుక ఎంతటి పెద్దలున్నా అరెస్ట్ చేయాలని, దీనిపై సీబీఐ దర్యాప్తు చేయాలని, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు.

సాక్షి ప్రతినిధి, బాపట్ల: నకిలీ మద్యం ఆజ్యంపై వైఎస్సార్ సీపీ నేతలు భగ్గుమన్నారు. ఉదయం నుంచి జోరుగా వర్షం కురుస్తున్నా లెక్కచేయలేదు. వర్షంలోనే ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్తల ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

● వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో వేమూరు రైల్వేగేటు నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకూ వైఎస్సార్ సీపీ నేతలు ర్యాలీ నిర్వహించారు. మద్యం బాటిళ్ల తోపుడు బండ్లపై ఉంచి, ప్లకార్డులతో చేపట్టిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. నకిలీ మద్యం అరికట్టాలని, విక్రయదారులపై కేసులు పెట్టి జైళ్లలో పెట్టాలని డిమాండ్ చేశారు. నకిలీ మద్యం తయారీ విక్రయాలపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని కోరారు. ఆ తర్వాత ఎక్సైజ్ కార్యాలయం వద్ద అరగంట సేపు ధర్నా నిర్వహించారు. తర్వాత అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

● రేపల్లె సమన్వయకర్త ఈవూరి గణేష్ ఆధ్వర్యంలో నగరం మండల కేంద్రం సెంటర్ నుంచి స్థానిక ఎక్సైజ్ స్టేషన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేపట్టారు. నకిలీ మద్యాన్ని విక్రయించిన వారిపై కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

● అద్దంకి సమన్వయకర్త డాక్టర్ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో అద్దంకి బంగ్లా రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం నుంచి నాగులపాడు రోడ్డులోని ఎక్సైజ్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. తోడుపు బండ్లపై మద్యం బాటిళ్లు ఉంచి నిరసన తెలిపారు. నకిలీ మద్యం విక్రయదారులపై కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఆ శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

● చీరాల సమన్వయకర్త కరణం వెంకటేశ్ ఆదేశాలతో పార్టీ పట్టణ అధ్యక్షుడు యాతం మేరిబాబు, ఇతర నేతలు చీరాలలో నకిలీ మద్యానికి వ్యతిరేకంగా నిరసన నిర్వహించారు. స్థానిక కొత్తపేట నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. నకిలీ మద్యం అమ్మకందారులపై కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని, సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులను ఎక్సైజ్ కార్యాలయం లోపలికి పోలీసులు అనుమతించకుండా అడ్డుకున్నారు. దీంతో అరగంట సేపు స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

● పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ పర్చూరు మండల అధ్యక్షుడు కఠారి అప్పారావు, ఇతర పార్టీ నేతలు పర్చూరులో సోమవారం నకిలీ మద్యానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. నకిలీ మద్యం తయారీ దారులపై కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

● బాపట్ల నియోజకవర్గంలో పార్టీ సమన్వయకర్త, మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ఆదేశాలతో పట్టణ అధ్యక్షుడు కాగితపు సుధీర్‌బాబు ఆధ్వర్యంలో పార్టీ నేతలు సోమవారం బాపట్లలో కోన భవన్ నుంచి ఎక్సైజ్ పోలీసు కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. నకిలీ మద్యం తయారీ దారులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



బండిపై మద్యం సీసాలతో నిరసన తెలుపుతున్న అద్దంకి నియోజవర్గ ఇన్‌చార్జి అశోక్‌కుమార్



చీరాలలో ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు ర్యాలీగా వస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పర్చూరులో భారీ వర్షంలో ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజలకు నాణ్యమైన సేవలందించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్

బాపట్ల: జిల్లా ప్రజలకు నాణ్యమైన సేవలందించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులకు సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో అధికారుల దగ్గరకు సమస్యలను చెప్పుకోవడానికి వస్తారన్నారు. వాటిని సావధానంగా విని పరిష్కరించాలని ఆయన చెప్పారు. ప్రజల నుంచి రెవెన్యూ, పోలీస్, సర్వే శాఖలకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని పరిశీలించడానికి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. అర్జీలను గడువులోగా పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. మండల స్థాయిలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన ఆదేశించారు. సంతమాగులూరు మండలంలో అర్జీలు ఎక్కువ శాతం పెండింగ్ ఉన్నాయని, వాటిని పరిష్కరించ దానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు.

గ్రామాల్లో పర్యటన

ప్రజా సమస్యలను పరిశీలించడానికి తాను మారుమూల గ్రామాల్లో సైతం పర్యటిస్తానని కలెక్టర్ ఈ సందర్భంగా చెప్పారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉన్న గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్‌ఈకి, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి గైర్హాజర్ అయిన ఆర్ అండ్ బీ ఎస్‌ఈకి నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రధానమంత్రి కుసుమ్ పథకం కింద ఏడు సబ్ స్టేషన్లు మంజూరయ్యాయని, వాటి నిర్మాణానికి భూసేకరణ వేగవంతంగా చేపట్టాలని చెప్పారు. అల్పపీడన ప్రభావం వల్ల జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఈనెల 13వ తేదీ నుంచి 17 వరకు సీపీఆర్ వారోత్సవాలను నిర్వహించాలని తెలిపారు. అత్యవసర సమయాల్లో ప్రజలను ప్రాణాపాయ నుంచి రక్షించడానికి ప్రతి ఒక్కరూ సీపీఆర్ గురించి తెలుసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా చీరాల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ శ్రీదేవి డెమోను ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, బాపట్ల రెవిన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, కేఆర్‌సీ డెప్యూటీ కలెక్టర్ ఎస్.లవన్న, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయమ్మ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధా మాధవి, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి రాజ్ దిబోరా, జిల్లా రవాణాశాఖ అధికారి పరంధామరెడ్డి పాల్గొన్నారు.

అవకాశం లేకే ఆ బిర్యానీ తిన్నాం !

- అప్పటి నుంచే వాంతులు, విరేచనాలు
- విచారణకు వచ్చిన ఉన్నతాధికారుల ఎదుట విద్యార్థుల ఆవేదన



ప్రత్తిపాడు: పెదనందిపాడు మండలం అన్నపర్రు బీసీ బాలుర హాస్టల్‌లో 54 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం బీసీ సంక్షేమశాఖ స్టేట్ అడిషనల్ డైరెక్టర్ డి.చంద్రశేఖర్‌రాజు, వైద్య ఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ బి.సుబ్రమణ్యేశ్వరి హాస్టల్‌లో విచారణ నిర్వహించారు. విద్యార్థులను ప్రశ్నించగా అవకాశం లేకే బిర్యానీ తిన్నామని చెప్పారు. తాజాగా ఉందా.. వాసన వస్తుందా ? అని అడుగ్గా తాజాగా లేదని తెలిపారు. హాస్టల్ వంటగది, విద్యార్థుల రూమ్‌లు, బెడ్‌లు, వంట పాత్రలు, తాగు నీరు తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. హాస్టల్ వాతావరణం అపరిశుభ్రంగా, గదుల్లో బూజుపట్టి ఉండటంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇదేమని సిబ్బందిని ప్రశ్నించారు. ఇంత ఘటన జరిగిన తరువాత కూడా హాస్టల్ ఇలా ఉంటే ఎలాగని ఆగ్రహించారు.

కడలి వెంట కన్నీటి చూపులు

- తీరానికి వచ్చిన గౌతమ్ మృతదేహం
- జాడలేని షారోన్ ఆచూకీ



తీరానికి వచ్చిన గౌతమ్ మృతదేహం

చీరాల: కడలి కెరటాలు ఆ కుటుంబాల్లో కన్నీటిని మిగిల్చాయి. సరదాగా సేద తీరేందుకు వచ్చి సముద్ర స్నానం చేస్తుండగా అలల తాడికిడి గల్లంతై ఐదుగురు విద్యార్థులు మృత్యువాత పడడంతో తీరం కన్నీటి సంద్రంగా మారింది. గల్లంతైన వారిలో ముగ్గురి మృతదేహాలు ఆదివారం రాత్రి ఒడ్డుకు చేరాయి. మరో విద్యార్థి మృతదేహం సోమవారం తీరానికి చేరింది.దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

ఆశలు అడియాస

అమరావతి పరిధిలోని విట్ ఇంజినీరింగ్ కాలేజీలో ఎంటెక్ చదువుతున్న ఏడుగురు స్నేహితులు ఆదివారం సెలవు దినం కావడంతో సరదాగా గడిపేందుకు చీరాల రూరల్ మండలం వాడరేవు సముద్ర తీరానికి వచ్చారు. సరదాగా సముద్రతీరంలో కేరింతలు కొట్టారు. ఉవ్వెత్తున వస్తున్న అలల దాటిని కూడా లెక్క చేయకుండా సముద్రంలో కేరింతలు కొట్టారు. కొద్దిసేపటికి అలలు ఎక్కువగా రావడంతో ఏడుగురు గల్లంతయ్యారు. స్థానిక మత్స్యకారులు గమనించి నలుగురు విద్యార్థులను బయటకు తీసుకువచ్చారు. అయితే, వీరిలో ఎంటెక్ చదువుతున్న సాయి మణిదీప్ (జడ్చర్ల), జీవన్ సాత్విక్ (హైదరాబాద్), శ్రీసాకేత్ (హైదరాబాద్)లు సముద్రంలో అలల తాకిడికి గల్లంతయ్యారు. ఎంత గాలించినా ముగ్గురి జాడ కానరాలేదు. కొంత సమయం తర్వాత ముగ్గురి మృతదేహాలు తీరానికి చేరాయి.

భోరుమన్న గౌతమ్ కుటుంబ సభ్యులు

మరో ఘటనలో వేటపాలెం మండలం వడ్డె సంఘానికి చెందిన ఇద్దరు విద్యార్థులు కూడా గల్లంతయ్యారు. ఆదివారం రాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టినా ఇద్దరి ఆచూకీ లభించలేదు. జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ స్వయంగా వాడరేవు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. మెరైన్, గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బంది సహకారంతో గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన వారి కోసం కుటుంబ సభ్యులు రాత్రంతా తీరం వద్దనే వేచి ఉన్నారు. సోమవారం ఉదయం తీరానికి గౌతమ్ కృష్ణప్రసాద్ మృతదేహం వచ్చింది. దీంతో కుమారుడిని చూసి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.



తీరంలో మృతదేహం కోసం గాలిస్తున్న పోలీసులు

మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

ఆదివారం వాడరేవు సముద్రతీరంలో గల్లంతై మృతి చెందిన ముగ్గురు విద్యార్థులు, సోమవారం తీరానికి చేరిన మరో విద్యార్థికి చీరాల ఏరియా వైద్యశాలలో సోమవారం పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. విద్యార్థులు గల్లంతైన సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలియచేయడంతో వారు హుటాహుటిన చీరాలకు వచ్చారు. ఏరియా వైద్యశాలలోని మార్చురీలో ఉన్న మృతదేహాలను చూసి కన్నీటిపర్యంతమయ్యారు. పెద్ద చదువులు చదువుకొని ఆసరాగా నిలుస్తారని అనుకుంటే అందరిని వదిలి వెళ్లిపోయావా? అంటూ కుటుంబ సభ్యులు చేస్తున్న ఆర్తనాదాలు కంటతడి పెట్టించాయి.

తీరంలో గాలింపు చర్యలు ముమ్మరం

ఆదివారం వాడరేవు సముద్రతీరంలో వేర్వేరు సంఘటనల్లో గల్లంతైన ఐదుగురు విద్యార్థుల్లో నలుగురు మృతదేహాలు లభ్యం కాగా మరో విద్యార్థి షారోన్ ఆచూకీ లభించలేదు. జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్, ఆర్డీఓ చంద్రశేఖర్‌నాయుడు, చీరాల డీఎస్పీ, సీఐలు, ఎస్సైలు తీరం వెంట గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం నుంచి వర్షం కురుస్తున్నా గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రానికి కూడా షారోన్ మృతదేహం లభించలేదు. దీంతో షారోన్ కోసం కుటుంబ సభ్యులు కూడా తీరం వెంటే ఉన్నారు.

వాడరేవు ఘటన బాధాకరం

- కలెక్టర్ వినోద్‌కుమార్
- గల్లంతైన విద్యార్థి కోసం గాలింపు ముమ్మరం



వాడరేవులో బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

చీరాల: మండలంలోని వాడరేవులో ఆదివారం జరిగిన ఘటన చాలా బాధాకరమైనదని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి ఆయన చీరాల మండలం వాడరేవు సముద్ర తీరం వద్ద గాలింపు చర్యలను పర్యవేక్షించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదుగురు విద్యార్థులు గల్లంతయ్యారన్నారు. నలుగురి మృతదేహాలు లభించాయని, మరొకరి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని తెలిపారు. జిల్లాలోని బీచ్‌ల వద్ద రానున్న రోజుల్లో ఇటువంటి దుర్ఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యార్థి ఆచూకీ కోసం పోలీస్, మత్స్యశాఖ, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారుల బృందాలు శ్రమిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి కోస్ట్‌గార్డ్, ఎన్‌డీఎఫ్ఆర్ కూడా తెలియచేసి వారి సహాయం కూడా తీసుకున్నామని చెప్పారు. సోమవారం ఉదయం కురిసిన వర్షం కారణంగా గాలింపు చర్యలకు ఆటంకం ఏర్పడిందని తెలిపారు. పది బోట్లు, ఆరు డ్రోన్ కెమెరాలు, పది మంది గజ ఈతగాళ్లు, పది మంది వీఆర్వోలను ఘటన జరిగిన వాడరేవు ప్రాంతం నుంచి ఇరువైపులా నాలుగు కిలోమీటర్ల పరిధిలో పరిశీలించేందుకు ఏర్పాట్లు చేశామని కలెక్టర్ వెల్లడించారు. చుట్టు పక్కల గల మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లిన సమయంలో మృతదేహం కనిపిస్తే చీరాల తహసీల్దార్, రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పామన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాస నాయక్, జిల్లా అగ్నిమాపక అధికారి నవీన్, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ కె.గోపీకృష్ణ, డీఎస్పీ ఎండీ మొయిన్, రూరల్ పోలీసులు ఉన్నారు.

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)



వచ్చిన బస్తాలు	55,844
అమ్మకాలు	54,702
నిల్వ	12,857

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000-14,800
నంబరు-5	10,000-14,500
273	10,500-14,000
341	10,000-15,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-15,000
నంబరు-5	10,000-14,500
341	10,000-15,600
4884	10,000-14,200
సూపర్-10	11,000-14,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 15,000
బాడిగ-355	10,500 - 15,600
దేవనూరు డీలక్స్	10,000 - 14,800
ఆర్మూర్	9,800 - 12,500
తాలుకాయలు	6,000 - 7,200

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-15,200
బాడిగ - 355	10,000-15,500
దేవనూరు డీలక్స్	10,500-14,700
తాలు	5,300 - 7,700

-కొరిటెపాడు (గుంటూరు)

భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయండి !

కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

బాపట్ల: ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు భూ సేకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం ఆయన ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీక్షణ సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ పనులకు అవసరమైన భూ సేకరణ వేగంగా చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భూ సేకరణ పూర్తయితేనే అభివృద్ధి పనులు వేగంగా జరుగుతాయని తెలిపారు. ఎన్‌హెచ్ -544 జీ నిర్మాణం కోసం జిల్లాలో సేకరించిన 19.8 హెక్టార్లకు గానూ మరో 4.5 హెక్టార్లలో భూమి సేకరించాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియను 45 రోజుల్లో పూర్తి చేయాలని చెప్పారు. ఇప్పటి వరకు సేకరించిన భూమికి నష్ట పరిహారాన్ని సదరు వ్యక్తులకు అందించాలని తెలిపారు. జాతీయ రహదారి-167 ఏ నిర్మాణానికి 88.38 హెక్టార్లలో భూమి సేకరించారని, మిగిలిన రెండు హెక్టార్లను కూడా త్వరగా సేకరించాలని ఆదేశించారు. భూమి సేకరించినప్పటికీ 158 మందికి నగదు చెల్లించకపోవడంపై ఆరా తీశారు. వినుకొండ నుంచి గుంటూరు రహదారి విస్తరణ పనులకు భూ సేకరణ ప్రక్రియ నవంబర్‌లోగా పూర్తి చేయాలని తెలిపారు. రొంపేరు కాలువ నిర్మాణానికి 117.45 ఎకరాల భూమి సేకరించగా, ఇందులో కొందరికి నేటికీ నగదు చెల్లించక పోవడంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సోలార్ ప్రాజెక్ట్‌కు తక్షణమే భూమి సేకరించాలి

సోలార్ ప్రాజెక్ట్ నిర్మాణానికి తక్షణమే భూమి సేకరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. దీని కోసం సంతమాగులూరు, బల్లికురవ మండలాల్లో 203.48 ఎకరాల ప్రభుత్వ భూమి, 1,591.17ఎకరాల పట్టా భూమిని సేకరించాల్సి ఉందన్నారు. మంచినీటి ట్యాంకుల శుభ్రపరిచే యూనిట్ ఏర్పాటు కోసం బాపట్ల మూలపాలెంలో రెండు ఎకరాలు, చీరాల దేవాంగపురి పంచాయతీలో 1.47 ఎకరాలు, ఇసుకపల్లిలో 3.5 4 ఎకరాలు, రేపల్లె బేతపూడిలో 1.35 ఎకరాల సేకరణలో సాంకేతిక సమస్య రావడంతో ప్రభుత్వానికి నివేదిక పంపాల్సి ఉందని తెలిపారు. నల్లమడ కాల్వ ఆధునికీకరణ పనుల సర్వే రెండు వారాలలో పూర్తి చేయాలని ఆదేశించారు. గుంటూరు చానల్ విస్తరణకు 51.34 ఎకరాలను పర్చూరు మండలంలో భూసేకరణ చేయాలని చెప్పారు. బాపట్లలో ఎస్టీ, బీసీ సామాజిక భవనాల నిర్మాణానికి భూమి సేకరించాలని, స్టేడియం నిర్మాణానికి 7.5 ఎకరాలు, ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాలకు ఐదు ఎకరాలు, మార్టూరులో మినీ స్టేడియం ఏర్పాటుకు భూమి సేకరించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డీఆర్వో జి.గంగాధర్ గౌడ్, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

అర్జీలు పునరావృతమైతే కఠిన చర్యలు

- సమస్యలను తక్షణమే పరిష్కరించాలి
- జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్

బాపట్ల టౌన్: పీజీఆర్ఎస్‌లో అర్జీలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 66 మంది బాధితులు వచ్చారు. తమ సమస్యలను నేరుగా ఎస్పీకి వివరించారు. బాధితుల సమస్యలు తెలుసుకున్న అనంతరం ఆయన జిల్లాలోని పోలీస్ అధికారులతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం పోలీస్‌స్టేషన్లకు వచ్చే బాధితులతో మర్యాదగా మెలగాలని, వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకొని పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీదారుల సమస్యలను చట్ట పరిధిలో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని చెప్పారు. బాధితులకు భరోసా కల్పించినప్పుడే పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని తెలిపారు. ప్రధానంగా ఫిర్యాదులు కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆస్తి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీ మోసాలపై వస్తున్నాయన్నారు. వాటిపై క్షుణ్ణంగా అధ్యయనం చేసి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రేపల్లె డీఎస్పీ ఏ.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ సీఐ ఎం. శ్రీనివాసరావు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

రైలులో అశోక్‌బాబు ప్రయాణం

- వేమూరు వెళ్లకుండా వాహనాన్ని అడ్డుకున్న పోలీసులు
- భట్టిప్రోలు నుంచి రైలులో ప్రయాణం



రైలు బండిలో ప్రయాణిస్తున్న అశోక్‌బాబు

భట్టిప్రోలు: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మాజీ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కల్తీ మద్యంపై నిరసన కార్యక్రమంలో పాల్గొనడానికి వస్తున్న వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబుకు పోలీసులు అడుగడుగునా అడ్డు తగిలారు. సోమవారం రేపల్లె నియోజక వర్గంలోని చెరుకుపల్లిలోని ఇంటి నుంచి వేమూరుకు వాహనంలో వస్తుండగా భట్టిప్రోలులో అడ్డు పడ్డారు. దీంతో ఆయన ఉదయం 9:30 గంటలకు భట్టిప్రోలు రైల్వే గేటు నుంచి కాలి నడకన రైల్వే స్టేషన్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి తరలి వచ్చారు. రేపల్లె నుంచి గుంటూరు వెళ్లే రైలు బండిని భట్టిప్రోలు ఎక్కి వేమూరులో దిగారు. ప్రయాణికులను కలసి వారిని కుశల ప్రశ్నలు వేశారు. ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

జీజీహెచ్‌లో ప్రపంచ బ్యాంకు బృందం పర్యటన



సిబ్బందితో మాట్లాడుతున్న ప్రపంచ బ్యాంకు బృందం సభ్యులు, పక్కన డాక్టర్ యశశ్వి రమణ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో సోమవారం ప్రపంచ బ్యాంకు బృందం పర్యటించింది. అత్యవసర సేవల విభాగం, ఎస్ఐసీయూ, పీఐసీయూ తదితర వైద్య విభాగాలను పరిశీలించింది. క్వాలిటీ ఎస్యూరెన్స్ నేషనల్ హెల్త్ మిషన్ తరఫున అత్యవసర విభాగం పనితీరు, అత్యధికంగా వస్తున్న రోగులకు మౌలిక వసతుల కల్పనపై అధ్యయనం చేసేందుకు క్యాజువాల్టీలో బృంద సభ్యులు పరిశీలించారు. అందులో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అత్యవసర చికిత్స కోసం ప్రతిరోజూ వచ్చే రోగులు, రోడ్డు ప్రమాద బాధితులకు అందించే చికిత్సలు, అత్యవసర వైద్య సేవలు అందించేందుకు క్యాజువాల్టీలో అందుబాటులో ఉన్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అత్యవసర విభాగం పనితీరు గురించి, క్యాజువాల్టీలో రోగుల రద్దీని తగ్గించడానికి తీసుకుంటున్న చర్యల గురించి బృందానికి జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ, వివరించారు. అనంతరం అప్పుడే పుట్టిన పసికందులకు చికిత్స అందించే ఎస్ఐసీయూ విభాగాన్ని బృంద సభ్యులు పరిశీలించారు. నవజాత శిశువుల మరణాల రేటు తగ్గించేందుకు తీసుకుంటున్న చర్యలపై వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జీజీహెచ్‌లో రోగులకు ఇన్‌ఫెక్షన్ సోకకుండా కంట్రోల్ కోసం తీసుకుంటున్న చర్యలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ, ఇతర వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిని పరిశీలించిన వారిలో ప్రపంచ బ్యాంకు బృంద సభ్యులు డాక్టర్ మొహిర్ జోన్, డాక్టర్ ఎడ్వర్డ్, డాక్టర్ గణేష్ మణి, వాసు బాబు తదితరులు ఉన్నారు.

చీఫ్ జస్టిస్ గవాయిపై దాడి హేయం



కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బాపట్ల టౌన్: చీఫ్ జస్టిస్ బి.ఆర్. గవాయిపై జరిగిన దాడిని భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా పరిగణించి దోషిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మంద పెంచలయ్య డిమాండ్ చేశారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు సోమవారం జిల్లాలోని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని గడియార స్తంభం నుంచి పాత బస్టాండ్, చీలు రోడ్డు సెంటర్ మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మంద పెంచలయ్య మాట్లాడుతూ గవాయిపై అనాగరిక దాడి వెనుక ఉన్న వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని కోరారు. విచారణ కమిటీను నియమించి, దాడి వెనుక ఉన్న కుట్రలను త్వరితగతిన తేల్చాలని డిమాండ్ చేశారు. జిల్లా ఎంఎస్పీ అధ్యక్షుడు బుడంగుంట్ల లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ జస్టిస్ గవాయి ఒంటరివాడు కాదని, ఆయనకు అండగా దళిత సంఘాలు మొత్తం అండగా ఉన్నాయని తెలిపారు. కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈనెల 17న జిల్లాస్థాయిలో, 23న రాష్ట్రస్థాయిలో అమరావతిలో భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజా సంఘాలు, దళిత సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు దుడ్డు వందనం, నాయకులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయిపై దాడి అనాగరిక చర్య

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ

గుంటూరు వెస్ట్: సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్ గవాయిపై సాక్షాత్తూ దేశ అత్యున్నత న్యాయస్థానంలో న్యాయవాది చేసిన దాడి సభ్యసమాజానికి సిగ్గుచేటని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. సోమవారం స్థానిక డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. కృష్ణమాదిగ విలేకరులతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి దళితుడు కావడం వల్లే ఈ దాడి జరిగిందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అనేక అభిప్రాయాలుంటాయన్నారు. దానికి ఇలా దాడులు చేయడం అత్యంత హేయమన్నారు. దళితులు దేశంలో ఎన్నో వివక్షలకు గురవుతూ ఎదుగుతుంటే, కొంత మంది ఓర్వలేక అక్కసుతోనే ఇటువంటి సంఘటనలకు పాల్పడుతున్నారన్నారు. దళితులు మరింత పట్టుదలతో ఉన్నత స్థానాలను పొందాలని కోరారు.

జీఎస్టీ ఫలాలు అన్నివర్గాల ప్రజలకు అందాలి



గుంటూరు వెస్ట్: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ ఫలాలు అన్ని వర్గాల ప్రజలకు అందేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద కార్మిక శాఖ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌లో భాగంగా నిర్వహించిన బైక్ ర్యాలీని డీఆర్వో జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తగ్గిన పన్నుల శాతంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి గత నెల 22 నుంచి ఈ నెల 19వ తేదీ వరకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్మిక శాఖ బైక్ ర్యాలీ ద్వారా అవగాహన కల్పిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ ఆశారాణి తదితరులు ప్రసంగించారు. బైక్ ర్యాలీ కలెక్టరేట్ నుంచి హిందూ కళాశాల సెంటర్, జిన్నా టవర్, బస్టాండ్, మంగళగిరి రోడ్డు మీదుగా ఆటోనగర్ వరకు కొనసాగింది.

రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన క్రీడాకారులు



ప్రథమ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్న క్రీడాకారులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): రాష్ట్ర స్థాయి పిట్టు స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లాలోని చంద్రగిరిలో ఈ నెల 11, 12వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ చాంపియన్ షిప్ పోటీల్లో గుంటూరు జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. బాలుర జట్టు ప్రథమ స్థానం, బాలికల జట్టు తృతీయ స్థానం దక్కించుకున్నాయని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దావులూరు సుబ్బారావు, పాపబత్తిని శ్రావ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలను చైర్మన్ రంభ ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు పి.సురేష్, రాష్ట్ర కార్యదర్శి కె.జె జోసఫ్ అభినందించారని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పెదకాకాని: వాకింగ్ చేస్తున్న మహిళల్ని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన రమావత్ లక్ష్మి, కొమ్మూరి అరుణ, శ్రీదేవిలు ఇరుగుపొరుగువారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న సర్వీసు రోడ్డుకు రోజూ మాదిరిగానే సోమవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లారు. వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం వచ్చి ఢీకొని వెళ్లిపోయింది. రమావత్ లక్ష్మి(43) సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. గాయాలపాలైన కొమ్మూరి అరుణ, శ్రీదేవిలను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. లక్ష్మి భర్త రామునాయక్ ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ టి.పి. నారాయణస్వామి తెలిపారు.

విజ్ఞాన్ ఫార్మసీ అవగాహన ఒప్పందం



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల, అమెరికాలోని టెంపుల్ యూనివర్సిటీల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని చైర్మన్ లావు రత్తయ్య సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెంపుల్ వర్సిటీతో ఫార్మాడీ ప్రోగ్రామ్‌కు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న దేశంలోని మొదటి సంస్థగా తమ కళాశాల గుర్తింపు పొందిందన్నారు. విద్యార్థులు, అధ్యాపకుల పరస్పర మార్పిడి కార్యక్రమాలు, సంయుక్త పరిశోధన ప్రాజెక్టులు, సాంస్కృతిక, ఇంటర్ డిసిప్లనరీ అవగాహనను పెంచనున్నామన్నారు. ఒప్పందాన్ని సాధ్యమయ్యేలా కృషి చేసినందుకు ఫార్మాడీ ప్రోగ్రాం డీన్ డాక్టర్ సతీష్ ఎస్. గొట్టిపాటిని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ శ్రీకృష్ణ దేవరాయలు, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, విభాగాధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో భారీ నష్టం

ఇరవైకి పైగా ఇళ్లలో కాలిపోయిన ఎలక్ట్రానిక్ వస్తువులు





కాలిపోయిన ఫ్యూజ్ క్యారియర్ , ఇన్వర్టర్

చినగంజాం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మండలంలోని మున్నంవారిపాలెం పంచాయతీ బేతాళవారి పాలెంలో సోమవారం పలు ఇళ్లలో ఎలక్ట్రానిక్ వస్తువులు భారీగా కాలిపోయాయి. రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. గ్రామంలోని సచివాలయం రోడ్డులో తీగ తెగడంతో అత్యధిక విద్యుత్ గృహ సర్వీసుల్లోకి రావడంతో భారీగా ఉపకరణాలు దెబ్బతిన్నాయి. గ్రామంలో 20 పైగా ఇళ్లలో 10కి పైగా టీవీలు, బల్బులు, 30కి పైగా ఫ్యాన్లు, వాషింగ్ మెషిన్లు, ఇన్వర్టర్లు, స్విచ్ బోర్డులు తగులబడ్డాయి. భారీ శబ్దాలతో విద్యుత్ ఉపకరణాలు తగులబడి పొగలు రావడంతో నివాసితులు భయపడిపోయారు. భారీ వర్షం కురుస్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక చర్చిలోని ఫ్యాన్లు, లైట్లు, ఇన్వర్టర్ సైతంపొగలు వచ్చి కాలిపోయాయి.

పాడై పోయిన వైర్లు

ఇటీవల గ్రామంలో షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. విద్యుత్ వైర్లు పూర్తిగా పాడైపోయాయని, వాటిని తొలగించి మార్చాలని గ్రామస్తులు పలుమార్లు చెప్పినా ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదే విధంగా పరిస్థితి కొనసాగితే ప్రాణాలు సైతం కోల్పోయే పరిస్థితి తలెత్తుతుందని వాపోయారు. సమస్యపై సాక్షి విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించింది. ప్రస్తుతం గ్రామంలో తాత్కాలికంగా మరమ్మతులు నిర్వహించామని, రెండు రోజుల్లో పరిశీలించి, సమస్య నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.